ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 211 | పేజీలు: 5 | వెల: రూ.3/- | శనివారం 7 నవంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

తెలంగాణలో మరో కొత్త పథకం ప్రారంభం

ప్రతి కుటుంబానికి రూ.5లక్షలు బీమా!

ఈ నెల 19న పథకాన్ని ప్రారంభించనున్నారు... సిద్ధిపేటలో ప్రారంభించనున్న ప్రభుత్వం



హైదరాబాద్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో మరో కొత్త పథకం ప్రారంభించడానికి ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈ నెల 19న దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేబినెట్ భేటీ తర్వాత పథకంపై కీలక ప్రకటన చేశారు. ఈ నెల 19న సిద్ధిపేటలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి ఆ రోజు నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ మొదలవుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభమవుతుందన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి సంబంధించి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరిస్తాయన్నారు. తహశీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వాటిని స్వీకరిస్తారని తెలిపారు. అంతేకాదు ఈ నెల 19న సిద్ధిపేట వేదికపై నుంచి ఇందిరమ్మ చీరలు రెండో విడత పంపిణీని ప్రారంభిస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా దీపావళి రోజున మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో పర్యటిస్తారు.. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈనెల 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభతో పాటుగా కొడంగల్‌లో మెగా రైతు మేళా, పారిశ్రామిక ఎక్స్‌పో నిర్వహిస్తారు. దీపావళి పండగరోజున నిర్వహించే సీఎం నుంచి సర్పంచ్ వరకు వారి పరిధిలో మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో భాగంగా ఒక ఇందిరమ్మ ఇంట్లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రాష్ట్రంలో కరవు పరిస్థితులపై సమగ్రంగా చర్చించేందుకు త్వరలో ప్రత్యేకంగ అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఎల్‌నినో కారణంగా ఏర్పడిన కరవు.. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు, రాబోయే రోజుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. కేంద్ర సాయం.. తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా అసెంబ్లీలో చర్చించాలని నిర్ణయించారు. ఇటు ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్-2026 నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



చేర్పులకు ఛాన్స్

గైర్హాజరు, వలసలు నమోదు ప్రక్రియ

ఈసీఐ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కీలక నిర్ణయం తీసుకుంది కేంద్ర ఎన్నికల సంఘం. గైర్హాజరు, వలస వెళ్లినవారు, మరణించినవారు, డూప్లికేట్ కేటగిరీల్లో గుర్తించి ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చని వారికి మరో అవకాశం కల్పించింది. ఎన్యుమరేషన్ ఫారాలు అందకపోవడంతో ముసాయిదా జాబితాలో చోటు దక్కని అర్హులైన ఓటర్లు తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లు చేర్చుకునేందుకు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్‌లకు వర్తించనున్నాయి. సంబంధిత పోలింగ్ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాల్లో ఓటర్ల జాబితాలను మరోసారి ప్రదర్శించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడానికి గల కారణాలను కూడా వెల్లడించాలని సూచించింది. రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలోనూ ఈ జాబితాలను PDF రూపంలో

..మిగతా 2లో

యెమెన్‌లో మార్కెట్‌పై
వైమానిక దాడి

20 మంది మృతి

2లో..



ఇది అతివృష్టి అనావృష్టి కాదు.. రేవంత్ సృష్టి

అసెంబ్లీ సమావేశాల్లో ఆధారాలతో సహా ఎండగడతామని హరీష్ రావు వ్యాఖ్యలు

రేవంత్ ప్రభుత్వం నీటిని దిగువకు వదిలేస్తుంటే,ఏపీ ఒడిసి పట్టు కుంటుంది

శ్రీశైలంలో తగినంత నీరున్నా కల్వకుర్తి వద్ద మోటార్లు నడపడం లేదు

ప్రభుత్వ అసమర్థతపై దుమ్మెత్తి పోసిన హరీష్ రావు



హైదరాబాద్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. "ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా, పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా, ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే,ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసి పట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకు పోయారని

..మిగతా 2లో

గ్లోబల్ వాల్యూ క్రియేషన్‌కు
కేంద్రంగా హైదరాబాద్

గ్లోబల్ కంపెనీల కార్యకలాపాల విస్తరణకు పూర్తి సహకారం

జీసీసీలను గ్లోబల్ టెక్నాలజీ అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం

పికో టెక్నాలజీ ఇండియా కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

గ్లోబల్ వాల్యూ క్రియేషన్‌కు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ కంపెనీలు తమ కీలక కార్యకలాపాలు, పరిశోధన, ఉత్పత్తుల అభివృద్ధికి హైదరాబాద్‌ను గమ్యస్థానంగా ఎంచుకునేలా అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. గ్లోబల్ కంపెనీల కార్యకలాపాల విస్తరణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. హైటెక్ సిటీలో న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న పికో టెక్నాలజీ ఇండియా కార్యాలయాన్ని శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి శ్రీధర్‌బాబు ప్రారంభించారు.

వంద జీసీసీల ఏర్పాటు లక్ష్యం..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రారంభంలో పికో సంస్థ ప్రతినిధులతో హైదరాబాద్‌లో పెట్టుబడులు, సంస్థ విస్తరణపై జరిపిన చర్చలు కార్యరూపం దాల్చడం సంతోషంగా ఉందన్నారు. ఏడాది వ్యవధిలో నగరంలో 100 కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. జీసీసీలను కేవలం సంప్రదాయ సేవలకే పరిమితం చేయకుండా.. గ్లోబల్ టెక్నాలజీ అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దడంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఇంజినీరింగ్, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి కీలక రంగాల్లోనూ అవి కీలక పాత్ర పోషించేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.



యువతకు అంతర్జాతీయ అవకాశాలు

హైదరాబాద్‌లో పికో టెక్నాలజీ కార్యకలాపాల విస్తరణతో స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు,

..మిగతా 2లో

ఆంక్షలు విధించడం వల్ల సమస్య
పరిష్కారం కాదు

ఢిల్లీలో తీవ్ర స్థాయికి చేరిన కాలుష్యం

పాఠశాలలో మూసివేయాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్

వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

ఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యానికి వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలే ప్రధాన కారణమని సుప్రీంకోర్టు పేర్కొంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌పై ఆందోళన వ్యక్తం చేసింది. దిల్లీని

..మిగతా 2లో





ఇంటింటికీ ఇంటర్నెట్

ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేసేందుకు కేంద్రంతో ఒప్పందం

ఈ ఒప్పందంతో రాష్ట్రానికి రూ. 3,185 కోట్ల నిధులు

త్వరలో తెలంగాణ రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆవిర్భావం

హైదరాబాద్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటా వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది. కేంద్ర ప్రభుత్వపు అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణ రాష్ట్రంలో రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేసేందుకు కేంద్రంతో ఒప్పందం పూర్తయింది. ఢిల్లీలోని సంచార్ భవన్‌లో జరిగిన తొలి బోర్డు సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఒప్పంద పత్రాలపై

..మిగతా 2లో

రాజేంద్రనగర్‌లోని ఐఐఎంఆర్‌లో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం)

నీతి, నిజాయితితో పనిచేస్తు నైతిక విలువలకు కట్టుబడి ప్రతి ఉద్యోగి ముందుకు సాగాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ సి తారా సత్యవతి అన్నారు. రాజేంద్రనగర్ లోని ఐఐఎంఆర్ లో అక్టోబరు 26న ప్రారంభమైన విజిలెన్స్ అవెర్నెస్ వీక్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కేంద్ర విజిలెన్స్ కమిషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవినీతి రహిత సంస్థ, సమాజాన్ని నిర్మించడంలో నైతిక విలువలు, సమగ్రత యొక్క పాత్ర ను నొక్కి చెబుతు శ్రేయస్సు కోసం నిజాయితి అనే ఇతి వృత్తాన్ని వ్యాప్తి చేస్తు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. శాస్త్రవేత్తలు, పరిపాలన, సాంకేతిక, పరిశోధన సిబ్బంది తో పాటు ప్రాజెక్టు అసోసియేట్లతో సహా సిబ్బంది సభ్యులందరిచేత సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యాలయాలలో నీతిని నిజాయితీని పెంపొందించడానికి సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, పోస్టర్ ప్రదర్శన ల వంటి వివిధ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిపికెట్లు అందజేశారు. అవినీతి యొక్క దుష్ప్రభవాల గురించి వివరించారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి అవినీతి రహిత సమాజాన్ని స్థాపించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో సంస్థ పరి పాలనాధికారి పి శివ ప్రసాద్, ఆర్థిక ఖాతాల అధికారి షేక్ రుక్మాన్ తదితరులు పాల్గొన్నారు.



విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సీ తారా సత్యవతి





గ్రామాల అభివృద్ధి పనులకు నిధుల వినియోగంలో వేగం

గ్రామపంచాయతీల ఖాతాల్లోకే సొంత ఆదాయం!

చట్ట సవరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

గ్రామపంచాయతీల ఆర్థిక స్వావలంబన దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామపంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకునే ఆదాయం ఇకపై నేరుగా వాటి ఖాతాల్లోనే జమ కానుంది. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం--2026 అమలుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 9 నుంచి ఈ చట్ట సవరణ అమల్లోకి వస్తుందని పేర్కొంటూ శుక్రవారం జీవో నంబర్ 43ను విడుదల చేసింది.

అభివృద్ధికి ఇక ఆటంకాలు ఉండవు

గతంలో గ్రామపంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకున్న ఆదాయం ట్రెజరీలో జమ కావడంతో నిధుల వినియోగంలో జాప్యం జరిగేది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారులు తదితర అత్యవసర అవసరాల కోసం నిధులు అందుబాటులోకి రావడానికి ఎదురుచూడాల్సి వచ్చేది. ఈ సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం చట్ట సవరణ చేపట్టింది. తాజా నిర్ణయంతో గ్రామపంచాయతీలు సమకూర్చుకునే సొంత ఆదాయం నేరుగా వాటి బ్యాంకు ఖాతాల్లోనే జమ కానుంది. దీంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వేగంగా ఖర్చు చేసే వెసులుబాటు కలగనుంది. గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన మరింత వేగవంతం కానుంది.

పల్లెల ఆర్థిక స్వావలంబనకు బాటలు

మంత్రి సీతక్క చొరవతో గ్రామపంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించే దిశగా ప్రభుత్వం ఈ చట్ట సవరణ తీసుకొచ్చింది. తాజాగా అమలుకు ఉత్తర్వులు వెలువడటంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పల్లెల ఆర్థిక స్వావలంబనకు ఇది కీలక ముందడుగు అని పేర్కొన్నారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా స్థానిక సంస్థలే నిధుల వినియోగంపై నిర్ణయాలు తీసుకునే అవకాశం కలగడంతో గ్రామీణాభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.

చేర్పులకు ఛాన్స్

మొదటి పేజీ తరువాయి...

అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. ఓటు నమోదు కాని సంబంధిత ఓటర్లకు పాక్షికంగా నింపిన ఎన్యుమరేషన్ ఫారాలనుఈసీఐనెట్ లో మళ్లీ జనరేట్ చేయనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. బీఎల్ ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను సంప్రదించి ఫారాలు అందజేయాలని, వాట్సాప్, ఈ-మెయిల్, ఎస్ ఎంఎస్ ద్వారా కూడా ఫారాలు పంపించే అవకాశం కల్పించాలని సూచించింది.పాత ఎపిక్ నంబర్‌ను నమోదు చేసి ఈసీఐ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, నింపుకోవచ్చు. గతంలో అదే నివాసంలో ఉన్నవారు ఎన్యుమరేషన్ ఫారంతో పాటు ఎందుకు ముందుగా సమర్పించలేకపోయారో వివరిస్తూ అనుబంధం-దీ ప్రకటన సమర్పించాలి. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్నవారు ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదు. కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గ వివరాలతో ఎన్యుమరేషన్ ఫారం, అనుబంధం-జ ప్రకటన, చిరునామా ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. కొత్త ప్రాంతంలోని బీఎల్ ఓ ను కూడా సంప్రదించి సహాయం పొందవచ్చు.ఈసీఐ నెట్ యాప్‌లో 'ఎడీశీశీఎ ఖ ఱ్ఱశ్రీశ్రీ ఎఱ్ఱష్ట్ర దీూూ సదుపాయం అందుబాటులో ఉంది.

ఇల్లు లేని వారి కోసం అవకాశం

ఇల్లు లేని వారికి చిరునామా రుజువు పత్రాలు లేకపోతే బీఎల్ ఓ క్షేత్రస్థాయి ధ్రువీకరణ నివేదిక సరిపోతుంది. ఫారాలను పరిశీలించి అర్హత, సాధారణ నివాసం తదితర వివరాలను ధ్రువీకరించిన తర్వాత ఈఆర్వోలు నిర్ణయం తీసుకుంటారు. ఆమోదించిన దరఖాస్తులను తుది ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ప్రత్యేకంగా ఉంచాలని, గతంలో ఉన్న ఎపిక్ నంబర్‌నే తిరిగి కేటాయించాలని ఆదేశం ఇచ్చింది. ఎస్ ఐఆర్ సమయంలో ఇప్పటికే కొత్త నమోదు కోసం ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన ఏ ఒక్క ఓటరుకూ అవకాశం కోల్పోకుండా చూడాలని రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఎన్నికల సంఘం సూచించింది.ఈ మేరకు అన్ని సంబంధిత రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఎన్నికల సంఘం కార్యదర్శి పవన్ దివాన్ లేఖ రాశారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినంత మాత్రాన తిరిగి నమోదు నిరాకరించినట్లు కాదని, నిర్దేశించిన ప్రక్రియలో దరఖాస్తు చేసుకుని అర్హతను నిరూపించుకుంటే తుది జాబితాలో పేరు చేర్చుకునే అవకాశం ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

యెమెన్‌లో మార్కెట్‌పై వైమానిక దాడి..

20 మంది మృతి

న్యూఢిల్లీ, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

యెమెన్‌లోని ఓ రద్దీ మార్కెట్‌పై జరిగిన వైమానిక దాడిలో 20 మంది మృతి చెందారు. అనేక మందికి గాయాలయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని హూతీ తిరుగుబాటు వర్గం పేర్కొంది. ఈ దాడికి సౌదీ అరేబియా కారణమని ఆరోపించింది. తైజ్ ప్రావిన్సులో ఈ ఘటన జరిగిందని, అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా ధ్రువీకరించింది. హల్ అదారా మార్కెట్‌పై మూడు వైమానిక దాడులు జరిగాయని, అనేక మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారని హూతీ సైనిక అధికార ప్రతినిధులు వెల్లడించారు. కామిస్ ముషాయిత్ వైమానిక స్థావరం నుంచి యుద్ధ విమానాలు టేకాఫ్ అయ్యాయని, తైజ్ ప్రావిన్సు మీదుగా వెళ్లాయని అన్నారు. మరోవైపు, తైజ్ ప్రావిన్సు అధికారులు మాత్రం వీటిని తోసిపుచ్చారు. ఇది హూతీల చర్యేనని.. ఇక్కడ ఎలాంటి వైమానిక దాడులు జరగలేదని పేర్కొన్నారు. హూతీ తిరుగుబాటుదారులే క్షిపణులతో విచక్షణారహితంగా దాడులు జరుపుతున్నారని స్థానిక ప్రభుత్వ మీడియా కార్యాలయం పేర్కొంది.

ఇంటింటికీ ఇంటర్నెట్

మొదటి పేజీ తరువాయి...

సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,185 కోట్ల భారీ నిధులు సమకూరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'తెలంగాణ రాష్ట్ర రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్' ను ఏర్పాటు చేయనున్నారు. టీ-ఫైబర్ ఎండీ పన్నీరు వేణు ప్రసాద్ ఈ కొత్త కార్పొరేషన్‌కు సీఈఓగా వ్యవహరించనున్నారు. టీ-ఫైబర్, కొత్త కార్పొరేషన్ సంయుక్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించనున్నాయి. ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు. సంచార్ భవన్‌లో జరిగిన నేరుగా జరిగిన కార్యక్రమంలో డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి టీ ఫైబర్ ఎండీ, సీఈఓ పన్నీరు వేణు ప్రసాద్, బీఎస్ఎన్ఎల్ఎ డైరెక్టర్ పాపా సుధాకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆంక్షలు విధించడం వల్ల సమస్య

పరిష్కారం కాదు

మొదటి పేజీ తరువాయి...

గాజియాబాద్, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్ వంటి ప్రాంతాలతో కలిపే రహదారులపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోందని ధర్మాసనం ప్రస్తావించింది. రోడ్లపై తిరుగుతున్న వాహనాల రకాలను పరిశీలిస్తే కాలుష్యానికి ప్రధాన కారణం అర్థమవుతుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. "మనం మాట్లాడుతూనే ఉంటాం. కొన్నిసార్లు ప్రకటనలు, సూచనలు చేస్తుంటాం. కానీ అసలు విషయం ఏమిటంటే ఏక్యూఐ ఇప్పటికే 400కి చేరువలో ఉంది" అని ఆయన అన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.కాలుష్య నియంత్రణ చర్యల విషయంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రజల ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. రోడ్లపై ఆధారపడి జీవనోపాధి పొందే పేద ప్రజలే కాలుష్య సమస్యతో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ముఖ్యంగా పండుగల సమయంలోనే అనేకమందికి ఉపాధి లభిస్తుందని గుర్తుచేసింది. అందువల్ల కాలుష్య నియంత్రణ పేరుతో పేదల జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా చూడాలని ధర్మాసనం అభిప్రాయపడింది.పంట గడ్డిని కాల్చడం వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని సుప్రీంకోర్టు సూచించింది. పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడానికి బదులుగా యంత్రాలను ఉపయోగించేలా ప్రోత్సహించాలని పేర్కొంది. పంట వ్యర్థాలను కాల్చడం వెనుక ఉన్న ఆర్థిక అంశాలను రైతులకు వివరించాలని తెలిపింది. ప్రత్యామ్నాయ పద్ధతులు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తే రైతులు పంట వ్యర్థాలను కాల్చడం మానుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. వాయు నాణ్యత సూచిక నిర్దిష్ట స్థాయికి మించి పెరిగితే అన్ని వయసుల విద్యార్థుల కోసం పాఠశాలలను మూసివేయాలని లేదా హైబ్రిడ్ విధానంలో తరగతులు నిర్వహించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందించిన ధర్మాసనం, నిపుణుల అభిప్రాయాల మేరకే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ జయమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం వాయు కాలుష్య నియంత్రణ నిబంధనలపై విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం, ఇతర అధికారుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కాలుష్య నియంత్రణకు సంబంధించిన చర్యలను కోర్టుకు వివరించారు.

కాలుష్య నియంత్రణకు ఐదు ప్రధాన రంగాలు

కాలుష్య నియంత్రణకు రూపొందించిన నిబంధనల చట్రంలో ఐదు ప్రధాన రంగాలను పరిగణనలోకి తీసుకున్నట్లు ఐశ్వర్య భాటి తెలిపారు. పారిశ్రామిక ఉద్గారాలు, వాహన కాలుష్యం, నిర్మాణం-కూల్చివేతల వల్ల వెలువడే ధూళి, రోడ్లపై ధూళి, పంట వ్యర్థాలను కాల్చడం వంటి అంశాలపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కొన్ని రకాల వాహనాల ప్రవేశంపై ఆంక్షలు విధించడం, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్లకు జియో-ట్యాగింగ్ చేయడం వంటి చర్యలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. యాప్స్, సోషల్ మీడియా ద్వారా అందిన ఫిర్యాదుల ఆధారంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్న వాహనాలపై చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మాసనానికి వివరించారు. గురువారం దిల్లీ కాలుష్యంలో పంట వ్యర్థాలను కాల్చడం వల్ల 14 శాతం కాలుష్యం నమోదవుతోందని ఆమె వెల్లడించారు. దీపావళి సెలవుల అనంతరం కోర్టు తిరిగి ప్రారంభమైన తర్వాత నవంబర్ 16న కొన్ని ఉత్తర్వులు జారీ చేసి, పిటిషన్‌పై విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. మరోవైపు, శుక్రవారం ఉదయం జాతీయ రాజధాని దిల్లీని దట్టమైన పొగమంచు కమ్మేసింది. గాలి నాణ్యత తీవ్రంగా క్షీణించి 'తీవ్ర' కాలుష్య స్థాయికి చేరువైంది. మొత్తం ఏక్యూఐ 391గా నమోదైంది. నగరవ్యాప్తంగా ఉన్న 59 పర్యవేక్షణ కేంద్రాల్లో ఉదయం 9 గంటల సమయానికి 30 కేంద్రాలు 'తీవ్ర' గాలి నాణ్యతను నమోదు చేశాయి. మిగిలిన కేంద్రాల్లో 'చాలా పేలవమైన' గాలి నాణ్యత నమోదైంది. అధికారిక గణాంకాల ప్రకారం రోహిణిలో అత్యధికంగా 475 ఏక్యూఐ నమోదవగా, ఐటీఓ దిల్లీలో 472 గా నమోదైంది. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు మరోసారి స్పష్టం చేశాయి.

అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం):

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కొత్తపల్లిలో అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు అనేక లాభాలు జరుగుతాయని , ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారని అనేక రకమైన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని పోటీలను సైతం నిర్వహించడం జరుగుతుందని పోటీల విద్యార్థులు పాల్గొనడంవల్ల క్రీడలల్లో ఆసక్తి పెరుగుతుందని వారు చెప్పారు. ఈ క్రమంలో డి. అక్షిత్ రెడ్డి, ూ+ఖీ వాలీబాల్ చాంపియన్షిప్ అండర్ -17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనడని చెప్పారు అని చెప్పారు. విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి జాతీయ స్థాయి పోటీలలోను అద్భుతమైన ప్రతిభను కనబరిచి ఉత్తమంగా ఉండాలని వారు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలలోను అద్భుతమైన ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



ఇద్దరు బాల కార్మికులకు విముక్తి

టీ, మెకానిక్ షాపుల్లో అధికారుల తనిఖీలు

ఐజ, నవంబరు 6(ప్రభాత ఉదయం)

పట్టణంలో వెట్టి చాకిరీ చేస్తున్న ఇద్దరు బాల కార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద ఆదేశాల మేరకు శుక్రవారం అయిజ పట్టణంలో టీ దుకాణాలు, మెకానిక్ షాపుల్లో డీడబ్ల్యూఓ సిబ్బంది తనిఖీలు నిర్వహించి ఇద్దరు బాలలను గుర్తించారు. వారిని విముక్తి కల్పించి బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరుపరిచారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పద్మ, నవీన్, కార్మిక శాఖ సిబ్బంది అయ్యన్న, పోలీసులు పాల్గొన్నారు.

ఇది అతివృష్టి అనావృష్టి కాదు.. రేవంత్ సృష్టి

మొదటి పేజీ తరువాయి...

పేర్కొన్నారు.గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించక పోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

గ్లోబల్ వాల్యూ క్రియేషన్‌కు కేంద్రంగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి...

సంస్థలకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

ముప్పైకి పైగా దేశాల్లో పికో సేవలు

పికో టెక్నాలజీ ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంస్థలకు టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సాఫ్ట్‌వేర్, డేటా, అనలిటిక్స్ సేవలు అందిస్తోంది. 30కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ.. 350కి పైగా సంస్థలకు సేవలందిస్తోంది. కార్యక్రమంలో పికో టెక్నాలజీ వ్యవస్థాపకుడు, సీఈఓ జారోడ్ యూస్టర్, సీఐఓ సీతారాం గొర్రె, చీఫ్ పీపుల్ ఆఫీసర్ మాట్ నార్మన్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా శ్రీ లక్ష్మీదేవి పూజలు

శ్రీ లక్ష్మీదేవి పూజలో పాల్గొన్న టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు కృష్ణారెడ్డి, చక్రపాణిలు







మెహదీపట్నం, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

మెహిదీపట్నంలోని నానల్ నగర్ చౌరస్తా లో విద్యుత్ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో దీపావళి పండుగ సందర్భంగా శ్రీ లక్ష్మీదేవి పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సర్కిల్ అకౌంట్ ఆఫీసర్ విజయ లలిత నేతృత్వంలో జరిగిన శ్రీ లక్ష్మీదేవి పూజల్లో టీజీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) కృష్ణారెడ్డి, చక్రపాణి, సీఈ గోపయ్య,జి ఎం అంజయ్య,ఎస్ ఈ ఎస్ రవి ప్రసాద్, ఎస్ ఏ ఓ రవీందర్, అకౌంట్స్ ఆఫీసర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



గగన్ పహాడ్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న యువకులు

పట్టభద్రులందరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం)

గగన్ పహాడ్ లోని బస్తీలలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో పట్టభద్రులు ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక నాయకులు ఎర్రోళ్ల యాదయ్య, సరికొండ దుర్గేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి పాల్గొన్నారు. డిగ్రీ పాసైన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రజా స్వామ్య ప్రక్రియ లో ప్రతి ఒక్క ఓటరు బాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తలారి శ్రీశైలం, ఈర్లపల్లి ప్రవీణ్, వల్లూరి నాగేశ్, శీలం తిరుపతిరెడ్డి, వల్లూరి విజయ్, కె హనుమాన్, జి సురేందర్, తలారి కిరణ్, నర్సింహ్మ, అకిరానందన్, శ్రీనివాసులు, లడ్డు, లక్ష్మణ్ లు పాల్గొన్నారు.

పీడీపీ చౌరస్తాలో ప్యాసింజర్

ఆటో ఎక్కుతున్నారా.. జర భద్రం

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం):

పీడీపీ చౌరస్తా లో రాత్రి వేళలలో ప్యాసింజర్ ఆటోలు ఎక్కుతున్నారా.. జర భద్రం. ఇటీవల జరిగిన దారిదోపిడి కేసు ను గమనిస్తే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాల్సిందేననిపిస్తుంది. పీడీపీ చౌరస్తా లో గాని, ఆరాంఘర్ చౌరస్తా లో గాని రాత్రి వేళలలో ఒంటరిగా ఉన్నప్పుడు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తేనే మేలనిపిస్తుంది. లేనట్లయితే విలువైన వస్తువులను పోగొట్టుకోవాల్సి వస్తుంది జాగ్రత్త అని చెప్పక తప్పదు. రెండు రోజుల క్రితం పీడీపీ చౌరస్తా లో ప్యాసిం జర్ ఆటో ఎక్కి సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాదితుడు బి సంజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. ఈ నెల నాలుగో తేదీన రాత్రి డ్యూటీ ముగించుకుని ఎనిమిది గంటల సమయంలో బుద్వేల్ కు చెందిన బి సంజయ్ కుమార్ పీడీపీ చౌరస్తా లో బస్సు దిగాడు. పీడీపీ చౌరస్తా నుంచి బుద్వేల్ కు వెళ్లడానికి ఆర్టీసీ బస్సు కోసం వేచి చూస్తున్నాడు. అదే సమయంలో ఓ ప్యాసింజర్ ఆటో వచ్చింది. అప్పటికే ఆ ఆటోలో డ్రైవర్తో పాటు ముందు ఒకరు, వెనుకాల ముగ్గురు ప్రయాణికులు కూర్చుని ఉన్నారు. బస్సు కోసం ఎదురుచూస్తున్న సంజయ్ కుమార్ ఆటోలో ప్రయాణికులు ఉన్నారు. కదా అని బుద్వేల్ కు వెళ్లడానికి ఆటో ఎక్కాడు. ఆటో కొద్ది దూరం వెళ్లాక మధ్య లో కూర్చున్న వ్యక్తి వాంతులు వస్తున్నాయని బి సంజయ్ కుమార్ ను మధ్య లో కూర్చోమని అతను చివర కూర్చున్నాడు. ఇంకా కొద్ది దూరం వెళ్లాక ముందు డ్రైవర్ పక్కన కూర్చున్న మరో ప్రయాణికుడు ఆటో లో గాలి తక్కువ గా ఉందని వెనుకాల వచ్చి కూర్చున్నాడు. అలా కూర్చున్న తర్వాత ఆటోలో కూర్చున్న ఓ వ్యక్తి బి సం జయ్ కుమార్ దగ్గర ఉన్న వన్ ప్లస్ సెల్ ఫోన్ ను లాక్కున్నారు. దానికి సంజయ్ కుమార్ ఆప్రమత్తమై నేను ఆటో దిగిపోతాను అని చెప్పడంతో ఆటో ఆపకుండ అతని వద్ద ఇంకేమి ఉన్నాయో అని చూడసాగారు. ఇంతలోనే సంజయ్ కుమార్ ఆటో లో ఉన్న వారితో పెనుగులాడటంతో అతన్ని ఆటో లో నుంచి బయటకు నెట్టి వేసి ఆటోను స్పీడుగా ముందుకు పోనిచ్చాడు డ్రైవర్. దీంతో బిత్తరపోయిన సం జయ్ కుమార్ సెల్ఫోన్ పోగొటుకున్న బాధ తో ఇంటికి చేరుకున్నాడు. గురువారం రాజేంద్రనగర్ క్రైం పోలీసులను కలిసి తనకు జరిగిన మోసం గురించి లిఖిత పూర్వకంగా ఏర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



వార్షిక క్రీడా దినోత్సవం లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎన్‌పీప పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో వార్షిక క్రీడా దినోత్సవం

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం)

శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ ఆవరణ లో గల పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ లో శుక్రవారం వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా రంజి క్రికెట్ మాజీ క్రీడాకారుడు, స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ ప్రతినిధి కె సాయిబాబా హాజరైనారు. జెండా ఆవిష్కరణ, మషాల్ రిలే, క్రీడా ప్రతిజ్ఞ తో వార్షిక క్రీడా దినోత్సవం ప్రారంభమైంది. విద్యార్థులు అద్భుతమైన కరాటే, ఆత్మరక్షణ ప్రదర్శన, యోగా ప్రదర్శన, నృత్య ప్రదర్శనలు, మానవ పిరమిడ్ నిర్మాణం, ఏరోబిక్స్, ఆత్యంత భరితమైన టగ్ ఆఫ్ వార్ (తాళ్ల లాగుడు) పోటీలను ప్రదర్శిం చారు. విద్యార్థులు తమ ప్రతిభ, క్రమ శిక్షణ, జట్టు స్ఫూర్తిని చాటుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కె సాయిబాబా మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న నాటి నుంచే క్రీడలలో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహిం చారు. వివిధ హౌజ్లలో విజేతలుగా నిలచిన చిన్నారులకు చాంపియన్ ట్రోపిలను అందజేశారు. విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ టి ఎ వి శర్మ విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషి ని అభినందించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో క్రీడల ప్రాముఖ్యత ను వివరించారు.


గగన్ పహాడ్... మామిడి కుంట చుట్టు ఫెన్సింగ్ వేసి కట్టను నిర్మించాలి

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం)

19.50 ఎకరాలలో విస్తరించి ఉన్న గగన్ పహాడ్ మామిడి కు ట చుట్టూరా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఇది శిఖం పట్ట చెరువు అని బోర్డులు పాతాలని బీజేపీ సీనియర్ నాయకులు సూరెడ్డి వినయ్ రెడ్డి కోరారు. మామిడి కుంటలో నీరు నిల్వకుండ పైపులైన్ ద్వారా బయటకు పంపిస్తున్నారని. అలా కాకుండ మామిడికుంట చెరువు చుట్టూరా బండ్



సూరెడ్డి వినయ్ రెడ్డి



మామిడి కుంట లోని నీరు బయటకు వెళ్లడానికి వేసిన పైపు లైన్

నిర్మించి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గగన్ పహాడ్ లో ఉన్న చెరువులన్ని శిఖం పట్టా చెరువులేనని, వాటన్నింటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన, రెవెన్యూ అధికారులపైన ఉందన్నారు. హైడ్రా అధికారులు వచ్చి చూసి వెళుతున్నారే తప్ప మామిడి కుంట ను కాపాడలేకపోతున్నారని వాపోయారు. ఇప్పటికైన అధికారులు మామిడి కుంట ను కాపాడి నీరు నిల్వ ఉండేలా చూడాలని సూరెడ్డి వినయ్ రె డ్డి కోరారు.

నేడు గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్లో

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

గగన్‌పహాడ్ సెక్షన్‌లో సామర్థ్య పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హర్షవర్ధన్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని ఇందిరా గాంధీ సొసైటీ సబ్-స్టేషన్‌కు చెందిన ఈ క్రింది ఫీడర్లపై విద్యుత్ సరఫరానిలిపివేయబడుతుందన్నారు.ఉదయం 11:00 గంటల నుండి 11:30 గంటల వరకుపద్మశాలిపురం ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన పద్మశాలిపురం, మధుబన్, టీఎన్జీవోస్ కాలనీ, ఆప్కో కాలనీ, మొదలైన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్, నవంబరు 6 (ప్రభాత ఉదయం) :



గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో సబ్ స్టేషన్ కెపాసిటీ పనుల నిమిత్తం ఈ నెల 7వ తేదీన ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు కరెంటు సరఫరా లో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఏఈ పి హర్షవర్దన్ ఓ ప్రకటన లో తెలిపారు. పద్మశాలిపురం ఫీడర్ పరిధిలో ను కరెంటు కోత ఉంటుం దన్నారు. దీని కారణంగా పద్మశాలిపురం, మధుబన్ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, ఆప్కో కాలనీలలో కరెం టు సరఫరా ఉండదన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం

రెండుగా చీలిన వ్యవసాయ వర్శిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం) :

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ రెండు గా చీలిపోయింది. 2025 మే 17న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నోటిఫికేషన్ తో వర్శిటీ లో నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కు ఎన్నికలు జరిగాయి. 18 నెలలు గడవక ముందే ఎన్నికలలో గెలిచిన అసోసియేషన్ ప్రతినిధులు రెండుగా చీలిపోయారు. దీనికి కారణం ఒంటెత్తు పోకడలే కారణమని తెలుస్తుంది. ఎన్నిక కాబడిన అసోసియేషన్ ప్రతినిధులు రెండు గా చీలిపోవడంతో చాలా సమస్యలు పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తుంది.

అసోసియేషన్ అధ్యక్షులు ఎం శ్రీనివాస్ యాదవ్ వైపు :

వర్శిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షునిగా గెలిచిన ఎం శ్రీనివాస్ యాదవ్ ఒక వర్గంగా ఏర్పడగా, ఆయన వైపు దశరథ(ఉపాధ్యక్షులు), సంజీవరెడ్డి (క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి), రవీందర్ రెడ్డి(కార్యనిర్వాహక కార్యదర్శి), షేక్ నజీర్ (కోశాధిగారి) లు ఉన్నారు.

అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. జయరాం వైపు

వర్శిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్ జయరాం మరో వర్గంగా చీలిపోయారు. ఆయన వైపు ఎం రాజు (అసోసియేట్ ప్రెసిడెంట్), జి పరమేశ్ (సంయుక్త కార్యదర్శి), జి సులోచన (టెక్నికల్ కార్యదర్శి) లు ఉన్నారు.

మాకు ప్రమోషన్లు ఇవ్వండి

వ్యవసాయ వర్శిటీ సీనియర్ అసిస్టెంట్లు

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం) :

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం 71 మంది జూనియర్ అసిస్టెంట్ లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చారని, ఆ విదంగానే సీనియర్ అసిస్టెంట్ లుగా పనిచేస్తు సూపరింటెండెంట్ లుగా ప్రమోషన్లకు అర్హత ఉన్న 18 తమకు సైతం వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతున్నారు. కోర్టు కేసు ఉందనే నెపంతో సీనియర్ అసిస్టెంట్లకు ఇచ్చే ప్రమోషన్లు ఆపారని, వ్యవసాయ విశ్వవిద్యాలయం తరపున ఆ కేసు ను కొట్టివేయి ంచి తమకు ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు: 2016 నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేసు బి న్నామని, ప్రమోషన్లకు అన్ని అర్హతలున్నా తమకు కావాలని ప్రమోషన్లు ఇవ్వడం లేదని కొందరు వా పోతున్నారు. దీనిపై వైస్ చాన్సలర్ దృష్టి సారించి తమకు న్యాయం చేయాలన్నారు.

రాజేంద్రనగర్‌లో రోడ్డు ప్రమాదం - ఒకరి మృతి

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం)

ఎదురుగా వెళుతున్న వాహనాన్ని ఢీ కొని ఆ తర్వాత డివైడర్ ను ఢీ కొనడంతో ఓ యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. మరో యువకునికి తీవ్ర గాయాలైనాయి. ఎస్ఐ రాజ్కుమార్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి..... హైదరరీడ లో నివాసం ఉండే సి కుమారి కుమారుడు సి అయ్యప్ప (18), స్నేహితుడు రాంచందర్ తో కలసి ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి హైదరరీడ నుంచి రాజేంద్రనగర్ వైపు వెళుతున్నాడు. వారు రాజేంద్రనగర్ లోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ వద్దకు వెళ్లగానే ముందుగా వెళుతున్న వాహనాన్ని ఢీ కొని డి వైడర్ ను గుద్దుకున్నారు. ఈ ప్రమాదంలో అయ్యప్ప అక్కడిక్కడే మృతి చెందారు. రాంచందర్ గాయాలపాలైనారు. అయ్యప్ప అమ్మ కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులపై మందు బాబుల దురుసు ప్రవర్తన

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం)

శివరాంపల్లిలోని ఓ బార్ వద్ద గురువారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది రాత్రి 12 గంటలు దాటినా బార్ మూసివేయకపోవడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు బార్ ను మూసి వేయాలని అడిగారు. ఈ సందర్భంగా మద్యం సేవించి ఉన్న కొందరు యువకులను అక్కడి నుంచి వెళ్లిపోమని సూచించారు. దానికి ఆ యువకులు మధ్యం సేవించడం పూర్తికాలేదని బిచెబుతు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పోలీసులు ద్విచక్ర వాహనాన్ని క్రింద పడేశారు. రాజేంద్రనగర్ పోలీసులు బార్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. పోలీసులు ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించే పనిలో పడ్డారు.



లక్ష్మీ పూజలలో పాల్గొన్న డీఈ గురుత్మంత్ రాజు

విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో లక్ష్మీదేవి పూజలు

రాజేంద్రనగర్, నవంబరు 6 (ప్రభాత ఉదయం)

శివరాంపల్లి లోని రాజేంద్రనగర్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం దీపావళి పండుగ సందర్భంగా శ్రీ లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. గగన్ పహాడ్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయం అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి నాగమణి, గోపి గోపాల్ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో రాజేంద్రనగర్ విద్యుత్ డీఈ గురుత్మంత్ రాజు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ, రమేశ్, అసిస్టెంట్ ఇంజనీర్లు గాయత్రి, దుర్గా ప్రసాద్, మల్లేశాజ్, రమేశ్, సంతోష్ బాబు, ప్రవీణ్, హర్షవర్దన్, సుధాకర్ బాబు, షేక్ బాషా, నవీన్, ఉద్యోగులు శ్యాంసుందర్, సైదా మల్లేశ్, కిరణ్, మహేందర్, ఎం కమలాకర్ లు పాల్గొన్నారు.

మాదిగ న్యాయవాదుల ఆధ్వర్యంలో

నేడు అలయ్ బలయ్ కార్యక్రమం

హైదరాబాద్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం) :

రాష్ట్ర స్థాయిలో 'మాదిగ అడ్వకేట్స్ ఆధ్వర్యంలో శనివారం అలయ్ బలయ్' కార్యక్రమాన్ని నగరంలోని ఖైరతాబాద్ లో గల విశ్వేశ్వరయ్య భవన్ లో శనివారం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వహణ కన్వీనర్ చాట్ల మణికుమార్, ప్రతినిధులు దున్న అంబేద్కర్, నేరెళ్ల పారిజాత పిలుపునిచ్చారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మాదిగ అడ్వకేట్ల ఐక్యతను చాటడంతో పాటు దేశ సమగ్రతను కాపాడటమే ధ్యేయంగా ఈ అలయ్ -బలయ్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీపి, ఏజీపీ, స్పెషల్ జీపీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, స్టాండింగ్ కౌన్సిల్స్, అడిషనల్ అడ్వకేట్ నియామకాల్లో మాదిగ అడ్వకేట్స్ కు అన్యాయం జరుగుతుందని, ఎస్సీ కోర్టుల్లో అడ్వకేట్స్ కు స్వంత ఇండ్లు గానీ సరైన ఆఫీసుల్లేవని వివరిస్తూ ఇండ్లు లేని ఎస్సీ న్యాయవాదులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించి ఇవ్వాలని,కార్యాలయాల ఏర్పాటుకు



కనీసం 20 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని, హైకోర్టు, జిల్లా కోర్టుల్లో జరిగే అన్ని నియామకాల్లో మాదిగ అడ్వకేట్లకు తగిన ప్రాధాన్యత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్. ప్రకారం విద్యా, ఉద్యోగ రంగాలు, ప్రమోషన్లు మరియు బదిలీల్లో ఎస్సీ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా జీవో విడుదల చేసినందుకు ప్రభుత్వానికి, ముఖ్యంగా ముఖ్యమంత్రికి ఈ వేదిక ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ వేడుకకు రాష్ట్రానికి చెందిన మాదిగ సామాజికవర్గ మంత్రులు దామోదర్ రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వేము నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కాలే యాదయ్య, మందుల సామేలు, లక్ష్మీకాంతారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసే ప్రతి ఒక్కరికీ భోజన వసతి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. కావున రాష్ట్రంలోని మాదిగ అడ్వకేట్లు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి ఆశీస్సులతో

ప్రజల సుఖసంతోషాలతో జీవించాలి

డి ఈ ఎం రమేష్ చంద్ర

విద్యుత్ కార్యాలయంలో ఘనంగా దీపావళి వేడుకలు

నార్సింగి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)

శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఇబ్రహీం భాగ్ డివిజన్ డిఇ ఎం రమేష్ చంద్ర అన్నారు. శుక్రవారం నార్సింగిలోని ఇబ్రహీంబాగ్ విద్యుత్తు రెవెన్యూ కార్యాలయంలో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో డివిజన్ డి ఈ ఎం రమేష్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు సాయినాథ్, సత్యనారాయణ రెడ్డి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పి రాజు, విద్యుత్ ఉద్యోగుల సంఘం నేత ఎం భాస్కర్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్లు సంతోష్, హాము నాయక్, శివరామకృష్ణ, ప్రదీప్ కుమార్, రాజేందర్, అంతయ్య గౌడ్, కోటేశ్వరరావు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు పరబ్రహ్మమూర్తి, ఎండి గౌస్, స్వామి, వెంకటేశం, ఉద్యోగులు శ్రావ్య, శ్రావణి, కరుణ శ్రీ, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 6(ప్రభాత ఉదయం):



గద్వాల పట్టణంలోని 28వ వార్డులో డ్రైనేజీ కాలువ బ్లాక్ కావడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను గుర్తించిన వార్డు కౌన్సిలర్ జి. చంద్రశేఖర్ దగ్గరుండి డ్రిల్లింగ్ మిషన్ సహాయంతో కాలువలోని అడ్డంకులను తొలగించారు. ప్రత్యేకంగా హోల్ ఏర్పాటు చేయించి మురుగునీరు ముందుకు వెళ్లేలా తాత్కాలిక చర్యలు చేపట్టారు. వార్డులో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.



ఎరువుల దుకాణంలో చోరీ

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 6(ప్రభాత ఉదయం):

ధరూర్ మండలం అల్వాల్ పాడు గ్రామ శివారులో ఉన్న జై హనుమాన్ అగ్రో ఎరువుల దుకాణంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షెట్టర్‌ను ధ్వంసం చేసి లోపలికి చొరబడ్డారని, క్యాష్ బాక్సులో ఉన్న రూ.25వేల నగదును అపహరించారని బాధితుడు తిరుమల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం షాపు తెరిచేందుకు యజమాని వెళ్లగా షెట్టర్ ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించాడు. షాపు తెరిచి చూడగా క్యాస్ బాక్సులో ఉన్న డబ్బు ఎత్తెకెళ్లారు. వెంటనే ధరూర్ పోలీసులకు సమాచారమివ్వగా..ఎస్ఐ తారక సంఘటన స్థలాన్ని పరిశీలించింది. క్లూస్ టీం వచ్చి చోరీ జరిగిన ప్రాంతంలో ఆధారాలను సేకరించారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



580 మందికి పైగా ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 6(ప్రభాత ఉదయం):

పేదింటి ఆడపడుచుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గద్వాల నియోజకవర్గంలోని 580 మందికి పైగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాల లబ్ధి పొందేందుకు ఎవరికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామని తెలిపారు. రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, ,, కార్యకర్తలు పాల్గొన్నారు.



మైనర్లకు వాహనాలు ఇవ్వటం చట్టరీత్యా నేరం

పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు .. తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

గద్వాల్ సీఐ టి.శ్రీను, టౌన్ ఎస్ఐ ఎం.శ్రీనివాస్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 6(ప్రభాత ఉదయం)

మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై, వాహన యజమానులపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని గద్వాల్ సీఐ టి.శ్రీను, టౌన్ ఎస్ఐ ఎం.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో వైఎస్ ఆర్ చౌక్ లో గద్వాల టౌన్ ఎస్ఐ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపే మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. పలు వాహనాలకు దృవపత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ టి.శ్రీను మాట్లాడుతూ... మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, ఏదైనా ప్రమాదాలు జరిగితే అందుకు వారే బాధ్యులవుతారని చెప్పారు. తల్లిదండ్రులు 18 ఏళ్లు నిండనీ పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్య నేరమన్నారు. 18 ఏళ్లు నిండి, డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాత మాత్రమే వాహనాలు నడపాలనీ తెలిపారు. పిల్లల పట్ల ఇష్టాలు ఉంటే వారికి వాహనాలు ఇవ్వకుండా చదువులో మెరుగ్గా రాణించే విధంగా మోటివేషన్ చేయాలని అన్నారు. ఇప్పటికే మైనర్ల డ్రైవింగ్ పై దృష్టి సారించామని అన్నారు. భవిష్యత్తో మరింత కఠినతరం చేస్తామనీ,తల్లిదండ్రులు గమనించి పోలీసు వారికి సహకరించి మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ కూడా వాహనాలు ఇవ్వద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




మెహదీపట్నం విద్యుత్ కార్యాలయంలో ఘనంగా దీపావళి శ్రీ లక్ష్మి దేవి పూజలు

మెహదీపట్నం, నవంబర్ 6(ప్రభాత ఉదయం)

మెహదీపట్నం లోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో దీపావళి పండుగ సందర్భంగా శ్రీ లక్ష్మీదేవి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం విద్యుత్ రెవెన్యూ కార్యాలయం జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీదేవి పూజలకు విద్యుత్ సెంట్రల్ సర్కిల్ ఎస్ ఇ ఎస్ రమేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మెహదీపట్నం విద్యుత్ డివిజన్ డి ఈ టి సుధీర్, ఏడిఈ , అసిస్టెంట్ ఇంజనీర్లు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



వెలుగుల పండుగకు వేళాయె..కొత్త శోభ మొదలాయె!



ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం):

పండుగకు ముందే నగరంలోని మార్కెట్లు రంగురంగుల కాంతులతో కొత్త శోభను సంతరించుకుంటున్నాయి. చిన్న ఇళ్ల నుంచి పెద్ద పెద్ద భవనాల వరకు విద్యుత్ కాంతులతో మెరిసిపోయేలా ఆకర్షణీయమైన లైట్లు అందుబాటులో ఉన్నాయి.ముఖ్యంగా రకరకాల రంగుల్లో వెలిగే లైట్లు, ప్రత్యేక ఆకృతుల్లో మెరిసే దీపాలు కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.సాయంత్రం వేళ మార్కెట్ వీధుల్లో ఈ లైట్ల వెలుగులు పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. తమ ఇంటిని ఇతరుల కంటే భిన్నంగా, అందంగా అలంకరించుకోవాలనే ఆసక్తితో ప్రజలు కొత్త డిజైన్ల లైట్లను ఎంపిక చేసుకుంటున్నారు.విద్యుత్ దీపాల మెరుపులు ఒకవైపు ఉంటే.. సంప్రదాయ మట్టి ప్రమిదల వెలుగులు మరోవైపు దీపావళి ప్రత్యేకతను చాటుతున్నాయి. గ్రామాల నుంచి పట్టణాలకు చేరుకున్న కుమ్మరులు, చిరు వ్యాపారులు వివిధ ఆకారాలు, పరిమాణాల్లో తయారు చేసిన మట్టి ప్రమిదలు, పూలను విక్రయానికి తీసుకొస్తున్నారు. ఇంటి ముంగిట అలంకరించుకునేందుకు అనువుగా సాధారణ ప్రమిదలతోపాటు ఆకర్షణీయమైన డిజైన్లలో రూపొందించిన దీపాలు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. పల్లెల్లో తయారైన ప్రమిదలు పట్టణ మార్కెట్లకు చేరడంతో గ్రామీణ చేతివృత్తిదారులకు ఉపాధి లభిస్తోంది. ఆధునిక విద్యుత్ దీపాలు ఎన్ని వచ్చినా సంప్రదాయ మట్టి ప్రమిదలకు ఉండే ప్రత్యేకత మాత్రం తగ్గడం లేదు.ఎక్కడ చూసినా మెరిసే విద్యుత్ దీపాలు, ఆకర్షణీయమైన అలంకరణ లైట్లు, సంప్రదాయ మట్టి ప్రమిదలు దర్శనమిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.చీకటిని పారదోలి వెలుగులు నింపే దీపావళి పండుగకు సమయం ఆసన్నమైంది. దీపావళి అంటేనే దీపాల వెలుగులు, రంగుల కాంతులు, ఆనందోత్సాహాల సమ్మేళనం. ఈ పండుగను మరింత అందంగా జరుపుకొనేందుకు ప్రజలు ఇళ్లను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించుకునేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో మార్కెట్లలో దీపావళి కొనుగోళ్ల సందడి మొదలైంది.ఈ ఏడాది మార్కెట్లో ఎన్నో రకాల కొత్త డిజైన్లలో విద్యుత్ దీపాలు అందుబాటులోకి వచ్చాయి.గతంలో కనిపించని విభిన్న ఆకృతులు, రంగుల్లో రూపొందించిన లైట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇళ్ల గోడలు, ప్రధాన ద్వారాలు, బాల్కనీలు, భవనాల పైభాగాలను అలంకరించుకునేందుకు అనువుగా చిన్న చిన్న బల్బుల నుంచి పెద్ద సీరియల్ లైట్ల వరకు వివిధ రకాల అలంకరణ దీపాలు మార్కెట్లో కొలువుదీరాయి. ఇంటి ముందు వరుసగా ప్రమిదలు వెలిగించడం, రంగురంగుల విద్యుత్ దీపాలతో భవనాలను అలంకరించడం దీపావళి పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అటు ఆధునిక అలంకరణలు.. ఇటు సంప్రదాయ దీపాల వెలుగులతో మార్కెట్లు పండుగ కళను సంతరించుకుంటున్నాయి.పండుగకు ముందే నగరమంతా వెలుగుల హరివిల్లును తలపిస్తుండగా, దీపావళి సంబరాలకు ప్రజలు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు.

రాజకీయాల్లో మహిళల ప్రాముఖ్యత కీలకం

విద్యావంతులను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి కవిత ఆదర్శంగా నిలిచింది

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు మహిళా శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలి

జిల్లా మహిళా అధ్యక్షురాలు అనుముల స్వప్న

కూకట్ పల్లి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని రంగారెడ్డి నగర్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సదస్సు ఘనంగా, విజయవంతంగా ముగిసింది. జిల్లా మహిళా అధ్యక్షురాలు అనుముల స్వప్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణ, పార్టీ బలోపేతంలో మహిళల పాత్రపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళామణుల ప్రాముఖ్యత ఎంతో కీలకమని, సామాజిక న్యాయం మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించే పార్టీ తెలంగాణ రక్షణ సేన అని స్పష్టం చేశారు. ఇందుకు నిదర్శనంగా ఉన్నత విద్యావంతులైన శ్రీకాంత్ గౌడ్, ఆకాష్‌లను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి కవితమ్మ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పార్టీ నాయకత్వం ఎంతో నమ్మకంతో అభ్యర్థులను రంగంలోకి దించినందున, రంగారెడ్డి - మహబూబ్‌నగర్ - హైదరాబాద్ స్థానంలో వారిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు మహిళా శ్రేణులు సమష్టిగా ప్రతి ఇంటికీ వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తమ పార్టీ అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా శ్రమించి, భవిష్యత్‌లో కవితమ్మను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని వక్తలు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పడాల మనోజ, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్, మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనగాల చైతన్య, పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ వేముల భవాని, కుత్బుల్లాపూర్ ఇన్‌ఛార్జ్ మారన్న, జిల్లా అధ్యక్షులు కె. నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి సీతారాం, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాళ్లు ఐలి కవిత, సంధ్యారెడ్డి, కుత్బుల్లాపూర్ మహిళా అధ్యక్షురాలు శాంత, ఉప్పల్ మహిళా అధ్యక్షురాలు సుధారెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షురాలు జ్యోతి, సీనియర్ మహిళా నాయకురాళ్లు స్వప్న, ఊర్మిళ, ఫరా బేగం సోనీ, విజయతో పాటు పెద్ద సంఖ్యలో మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సదస్సును విజయవంతం చేసిన నాయకులందరికీ అనుముల స్వప్న కృతజ్ఞతలు తెలియజేశారు.



మున్సిపల్ కార్మికుల సమ్మె..

కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం):

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. అధికారులు, పాలకవర్గం స్పందించడం లేదంటూ శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ కమిషనర్ కు, పాలకవర్గానికి వినతి పత్రాలు సమర్పించిన పట్టించుకోలేదని ఆరోపించారు. వారి నిర్లక్ష్యం కారణంగానే సమ్మె అనివార్యమయిందని పేర్కొన్నారు. తగినంత సిబ్బంది లేని కారణంగా ఉన్న సిబ్బందిపై అదనపు భారం మోపి, జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు.60 సంవత్సరాలు పైబడి రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానాలలో పైనుండి ఆదేశాలు వచ్చేవరకు తాత్కాలికంగానైనా సరే వారి కుటుంబ సభ్యులను పనిలో పెట్టుకోవాలని, అదనంగా కార్మికులను నియమించి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ చొరవ తీసుకొని కార్మికుల సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మూశం రమేష్, యూనియన్ అధ్యక్షులు కాసారపు శంకర్, బాబా కిషన్, అర్జున్ , ఉమ, లక్ష్మీ, విజయ, దేవరాజు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు ఆరోపణలు మానండి

కూకట్‌పల్లి అభివృద్ధికి సహకరించండి!

నిరుపేదల సొంతింటి కలకు అడ్డుపడకండి

రమ్య గ్రౌండ్ వద్ద ఎన్టీఆర్ పేరుతో పాఠశాల నిర్మాణం ఏమైంది

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి సూటి ప్రశ్నలు వేసిన శేరి సతీష్ రెడ్డి

కూకట్ పల్లి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం)



కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గత పదేళ్లుగా తెలంగాణలో మీ పార్టీ అధికారంలో ఉంది. మీరు చెప్పిన పనులు చేయించుకునే అవకాశం, ప్రభుత్వంపై పలుకుబడి ఉన్న సమయంలో కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ఈ అంశాలు ఎందుకు గుర్తుకు రాలేదు? ఇప్పుడు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విమర్శలు చేయడం కంటే నిర్మాణాత్మకంగా సహకరిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందిని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్చార్జి సేరి సతీష్ రెడ్డి హితవు పలికారు.

మెట్రో పార్కులో స్టేడియం నిర్మాణం

కూకట్‌పల్లి మెట్రో పార్కులో యువత కోసం స్టేడియం నిర్మించాలనే ఆలోచన గత పదేళ్లలో ఎందుకు కార్యరూపం దాల్చలేదు? మీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ప్రజలకు సమాధానం చెప్పాలి.

కేపీహెచ్‌బీ--జేఎన్‌టీయూ రోడ్డులో పెట్రోల్ బంక్ అంశం

కేపీహెచ్‌బీ--జేఎన్‌టీయూ రోడ్డులో పెట్రోల్ బంక్ ఏర్పాటు అంశం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? గత పదేళ్లలో ఈ స్థలానికి సంబంధించి మీరు తీసుకున్న నిర్ణయాలు ఏమిటి? ఈ అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి.

రమ్య గ్రౌండ్ వద్ద ఎన్టీఆర్ పేరుతో పాఠశాల

రమ్య గ్రౌండ్ సమీపంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరుతో పాఠశాల నిర్మిస్తామని చెప్పి మీ పార్టీకి చెందిన కార్పొరేటర్ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై మీ సమాధానం ఏమిటి? ఆ పాఠశాల నిర్మాణం ఏమైంది? నిధుల సేకరణ జరిగి ఉంటే వాటి వివరాలను ప్రజల ముందు ఉంచాలి.

నిరుపేదల సొంతింటి కలకు అడ్డుపడకండి

హైదరాబాద్ మహానగరంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఇంటి అద్దెల భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాంటి కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేసే దిశగా తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఎల్ఐజి, ఎం ఐ జి గృహాల నిర్మాణం చేపట్టాలనే ఆలోచనను స్వాగతించాలి.

దాదాపు రూ.40 లక్షల విలువైన ఇంటిని రూ.6 లక్షలకే అందించే ప్రతిపాదన, లక్ష మంది గృహ అవసరాలను తీర్చాలనే లక్ష్యం నిజంగా అమలైతే అది పేద, మధ్యతరగతి కుటుంబాలకు గొప్ప ఊరట అవుతుంది. ఈ ప్రతిపాదనకు సంబంధించిన అర్హతలు, నిధులు, అమలు విధానాన్ని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలి. ఇలాంటి ప్రజాప్రయోజన కార్యక్రమాలను రాజకీయ కోణంలో చూడకుండా, నిరుపేదలకు మేలు జరిగేలా ఎమ్మెల్యేగా మీరు సహకరించాలి.

ఎమ్మెల్యే కృష్ణారావు గారికి నా సలహా!

కృష్ణారావు మీరు కూకట్‌పల్లి ప్రజల ఆశీర్వాదంతో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. అది అందరికీ తెలిసిన విషయమే.

మీ రాజకీయ అనుభవాన్ని, ప్రజలిచ్చిన అవకాశాన్ని నియోజకవర్గ అభివృద్ధికి ఉపయోగించాల్సిన సమయం ఇది. ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమంలో మీరు భాగస్వాములు కావాలని మా కోరిక. మంచి కార్యక్రమాలకు మద్దతు తెలపండి. అవసరమైతే ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసే దిశగా, రాజకీయంగా కూడా మీ నిర్ణయాన్ని పునరాలోచించండి.

రాజకీయ విమర్శల కంటే ప్రజల అభివృద్ధే ముఖ్యమని గుర్తించండి. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సింది రాజకీయ ఆరోపణలు కాదు... అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నిరుపేదలకు సొంత ఇళ్లు, యువతకు మెరుగైన అవకాశాలు! ఒక్కసారి ఆలోచించండి కృష్ణారావు.

కూకట్‌పల్లి అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దాం!.



వేములవాడలో అమానుషం..

బతికుండగానే శ్మశానానికి తరలింపు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం):

మనిషికి కష్టమొస్తే ఆదుకోవాల్సిన సమాజంలో.. కనీసం తలదాచుకునేందుకూ చోటు దొరకని దుస్థితి నెలకొంటే అంతకంటే దారుణం మరొకటి ఉండదు. ఈ నేపథ్యంలో తీవ్ర అనారోగ్యంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ వ్యక్తిని.. బతికుండగానే శ్మశానానికి తరలించారు కుటుంబ సభ్యులు. ఈ హృదయ విదారక ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో చోటుచేసుకుంది.వేములవాడకు చెందిన రాకేశ్‌కు అమృత అనే మహిళతో వివాహమైంది. అయితే.. కొంతకాలానికే ఆమె రాకేశ్‌కు విడాకులిచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తల్లితో పాటు ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు రాకేశ్. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రాకేశ్‌ను ఇటీవల స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ అక్కడి వైద్యులు అతణ్ని ఆస్పత్రిలో చేర్చుకునేందుకు నిరాకరించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న రాకేశ్‌ను కిరాయి ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. ఇంటి యజమాని అనుమతించలేదని తెలుస్తోంది.దీంతో అప్పటికే దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబ సభ్యులు.. ఏం చేయాలో పాలుపోని స్థితిలో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇక చేసేదేమీ లేక ప్రాణాలతోనే ఉన్న రాకేశ్‌ను వేములవాడ వైకుంఠధామానికి తరలించామని వాపోతున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి వైద్య సాయం, కనీస ఆశ్రయం అందించాల్సిందిన సమయంలో ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం స్థానికంగా కలకలం రేపింది.



టీఆర్ఎస్ ధరూర్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్6(ప్రభాత ఉదయం)

ప్రజా సమస్యల పరిష్కారమే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు బుచ్చిబాబు యాదవ్ అధ్యక్షతన శుక్రవారం గద్వాలలోని ఆ పార్టీ కార్యాలయంలో ధరూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మల్దకల్, ప్రధాన కార్యదర్శిగా బి. రాము, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విజయ్‌కుమార్, మీడియా ఇన్‌చార్జిగా గోవిందు తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను రంజిత్‌కుమార్, బుచ్చిబాబు యాదవ్ శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



580 మందికి పైగా

ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 6(ప్రభాత ఉదయం):

పేదింటి ఆడపడుచుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గద్వాల నియోజకవర్గంలోని 580 మందికి పైగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాల లబ్ధి పొందేందుకు ఎవరికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామని తెలిపారు. రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడిసెల్లో నివసించే 85 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 6(ప్రభాత ఉదయం)

అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల నియోజకవర్గంలోని గుడిసెల్లో నివసిస్తున్న 85 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తోందని, లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ అవుతుందని గద్వాల ఎమ్మెల్యే తెలిపారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, రాష్ట్ర బోయ వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ సుభాన్, గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608